


# అడవి గాచిన వెన్నెల

శాంత ముఖంలో యెప్పుడూ అసూవాన్య రేఖలు తాండవిస్తూవుండడం చూస్తోంటే ఆనందరావు బుర్రలో పుట్టెడాలోచనలు బయల్దేరాయి. పెండ్లయిన తర్వాత అత్తవారింటి దగ్గిర పట్టుమని పది దినాలుండటం ఆనందరావుకయితే మొదటిసారి. తన భార్య సరోజ యెప్పుడూ కిలకిల్లాడుతూ యిల్లంతా కలియ తిరగడం, శాంత యెప్పుడూ యేదో ఆలోచిస్తూ ఓమూలన కూర్చొనివుండటం చూస్తే ఆనందరావుకు అనాటి కాలాడు మతిపోయినట్టుంటోంది. శాంత వ్యాకులతకు కారణాన్ని అన్వేషించడం ప్రారంభించాడు. ఆ యింట్లోనే వుంటున్నప్పుడు అంతమాత్రం గ్రహించలేక పోతాడా? శాంత, సరోజ అక్కచెల్లెండ్రు. శాంతకు బాల్యంలోనే పెండ్లయింది. చుట్టరికం పోతుందని శాంతను మేనమామకిచ్చి ముడిబెట్టారు. శాంత భర్త శేషయ్య గుణవంతుడే కాని యేభై సంవత్సరాలు ముదిరిపోయిన మనిషి. ఏ కోణంనుండి చూచినా శాంతతో పోల్చేందుకు వీలులేదు. శాంతకిప్పుడు 18 సంవత్సరాలకంటే హెచ్చు వుండవు. నవ యవ్వనం తొణికిసలాడే శాంత, ముదిరి గడ్డుగట్టిన శేషయ్యతో దాంపత్య సౌఖ్యాన్ని అనుభవించలేక పోయింది. పండువెన్నెల, పున్నమ చంద్రుని కేసి చూస్తూ-మధుర జీవితాన్ని గురించి కలలు గంటూ జీవితాన్ని వెళ్లబుచ్చవలసిందే! శేషయ్య తన యౌవ్వన జీవితాన్నంతా యిదివరకే పరాయివాళ్లతో గడిపివేశాడు. ఇక పోతే శాంతకు మిగిలింది వ్యాధులతో కృశించిన శేషయ్య యెముకలగూడు మాత్రమే. ఆ ఎముకలగూడును అలాగే కనిపెట్టుకొని, ప్రతిరోజూ అర్చన చేస్తూవుంటేనే శాంతకు యీ సంఘంలో గౌరవం, మర్యాదలు నిలుస్తాయి. అయినా సాటి యువతుల మధ్య శాంతకు నిత్యావమానమే! శాంత నోటుతరహా మనిషి కాదు. సత్యకాలపు మనిషి అసలే కాదు. నాస్తో కూస్తో చదువుకొంది. అంతో యింతో విజ్ఞానాన్ని వృషవపించింది. కొద్దో గొప్పో ఈనాటి భావాలుగలిగిన అమ్మాయి. పాపం తన భావాలకు, ఆలోచనలకు, విరుద్ధమైన దాంపత్య

"రఘు"

జీవితం. ఒకప్రక్క తీరనికోర్కెలు, దాంతో చెప్పలేని మనోవ్యథ. మరోప్రక్క పాతివ్రత్యము, సంఘము, వేరొకప్రక్క వ్యక్తి, గౌరవము, కుటుంబము ఇవన్నీ శాంత హృదయంలో ప్రతినిత్యమూ ప్రజ్వరిల్లే సుడిగాడ్పులు. యౌవ్వనం మానవ జీవితంలో ముఖ్య ఘట్టం. ఆ దశలోని మృదుమధుర సన్నివేశాలే యావత్తు జీవితానికి సోపానాలు. ఆదశ విషాద ఛాయల్లో సాగిపోతే జీవితానికి ఒక పెద్ద లోటు.

అందచందాలలోగాని, విజ్ఞానంలోగాని, చదువు సంధ్యల్లోగాని తనతో యేమాత్రమూ సరితూగలేని అనేకమంది సాటి యువతులు తాను కనివిని యెరుగని మధుర సౌఖ్యాన్ని చవి చూస్తున్నారు. మరి తానో! రోగాల పుట్టయైన ముసలి మగనికి తిండి వండి పెడుతూ, పరిచర్యలు చేస్తో కాలం గడుపుతోంది. సాటివారిలో యీమె స్థితికి సానుభూతి వచనాలు రావుగాని, పరాచక ప్రవచనలు దండిగా వినబడతాయి.

వసంతకాలపు వెన్నెట్లో చకోర పక్షులు కిలకిలారవములు చేస్తున్నాయి. పున్నమ చంద్రుని చుట్టూ నక్షత్రాలు వసంతాన్ని చల్లుతున్నాయి గోపాలకృష్ణునిపై గోపికలు చల్లినట్టు. ప్రతి రోజూ ఆనందరావుకు జంటగావుండే సరోజ బయటచేరి ఆనందరావును యేకాకిని చేసింది. పండు వెన్నెల చూస్తుంటే ఆనంద్‌కు నిద్ర రావడం లేదు. శాంత జాలి నేత్రాలు ఆకాశంలోని నక్షత్రాలలో మెరుస్తూ ఆ కిరణాలు తన నేత్రాలలో నాట్యం చేస్తున్నట్టున్నాయి. ఇంటిలోని వారంతా అనుదైట నిశ్శబ్దంగా నిద్రిస్తున్నారు. ఆనందరావు ఒక్కడే పెరట్లో నిద్రాదేవతతో దెబ్బలాడినవాడిలా నక్షత్రాలకేసి అలాగే చూస్తున్నాడు. ఏదో ఆలోచన తట్టినవాడిలా చివాలున లేచి కూర్చున్నాడు. తలగడ క్రింద అగ్గిపెట్టె తీసి లైటు వెలిగించాడు. కాగితంతీసి యేదో వ్రాయడం ప్రారంభించాడు.

కొన్ని నిముషాలపాటు అలాగే వ్రాస్తూ అనుకోకుండా తల పైకెత్తాడు. వన దేవతలా తన కళ్ళెదుట ప్రత్యక్షమైయున్న శాంతను జూచి నిర్ఘాంతపోయాడు. కానేపు తన కండ్లను తానే నమ్మలేకపోయాడు. మరుక్షణంలో కల అనుకొన్నాడు. ఇలాగే రెండు మూడు నిముషాలు సాగిపోయాయి. ఎంతో చనువున్న దానిలా శాంత ఆనందరావు దగ్గరలో నిలబడి 'ఏమిటి యింతరాత్రి పూట వ్రాస్తున్నారు?' అని సన్నని మన్నికమైన గొంతుకతో మెల్లగా ప్రశ్నించింది శాంత. 'ఆఁ... ఏమీ లేదు' అని తడబడే పెదవులతో జవాబు చెప్పాడు ఆనంద్.

ఇంకాస్త దగ్గరగావచ్చి శాంత 'మీరు కథలూ, అవీ చాలా బాగా వ్రాస్తారట్లే వుందే!' చిరునవ్వుతో పలికింది.

'ఏదో... వ్రాస్తూ వుంటాను' అని క్లుప్తంగా సమాధాన మిచ్చాడు. శాంత తీసుకొంటున్న చనువుకు ఆనంద్ ఆశ్చర్యపడుతున్నాడు, భయపడుతున్నాడు, సిగ్గుపడుతున్నాడు కూడా. అయినా యెప్పుడైనా అవకాశం చిక్కితే పరిచయం జేసికొందా మనుకొన్నాడు గాని తాను స్వయంగా చేయాలనుకొన్న ప్రయత్నం యెన్నాళ్ళకూ సాగిందికాదు. రెండుమూడు సార్లు సరోజతో శాంత ప్రస్తావన యెత్తకపోలేదు. కానీ అవిడ వినీ విననట్లు వూరుకొన్నది. చివరకు విసుక్కొన్నది కూడా. శృతిమించి రాగాన పడుతుందేమోనని భయంతో మళ్ళీ శ్రీవారిదగ్గర శాంత ప్రస్తావన యెత్తలేదు. కానీ అవకాశం దొరికినప్పుడల్లా దొంగలాగా శాంత జాలి నేత్రాలలోనికి తొంగి చూస్తుండేవాడు.

శాంత మరీ దగ్గరకు వచ్చింది. 'మీరు వ్రాసేదేమిటో కాస్త చెప్పరూ!' అని అడిగింది ఆప్యాయంగా. ఆనంద్ ధైర్యం తెచ్చుకొన్నాడు. 'నీ చరిత్రే' అన్నాడు ముక్తసరిగా.

'నాబ్రతుక్కూ ఓ చరిత్రకూడానా!' నిరాశను ప్రకటిస్తూ అన్నది శాంత.

తర్వాత యేమని మాట్లాడాలో ఆనంద్‌కు అర్థంకాలేదు. అసలు, జీవితంతో విసిగి వేసారిన వారితో యేమాట మాట్లాడితే యేం ముంచుకొస్తుందో! జీవితంతో నిత్యపోరాటం సల్పుతూ వున్న శాంత మనస్సుకు సంతోషం వుత్సాహం ఆశ కలిగించాలంటే యెటువంటి మాటలు మాట్లాడితే సరిపోతుందోనని కాసేపు తటపటాయించాడు ఆనంద్.

'నీ జీవితం సంఘానికి పాఠం ఔతుందని

నా నమ్మకం' అన్నాడు ఆనంద్ ఉపన్యాస ధోరణిలో—

'నా జీవితంలో యేమంత మహత్తర ఆశయం వుందని అలా అంటున్నారు!' తిరుగు ప్రశ్న వేసింది శాంత.

'ఉత్కృష్ట ఆశయాలుగల వారి జీవితాలు కొందరకు ఆదర్శమౌతాయి. విజ్ఞత వివేచన లేని నేటి సమాజపు యినుప పాదాలక్రింద నలిగిపోతున్న నీవంటి అమాయిక జీవుల జీవితాలు సంఘంలోని ప్రతివ్యక్తికీ గుణపాఠాలౌతాయి' అని మరో లెక్చర్ దంచేశాడు ఆనంద్.

'అవును. వట్టి ఉపన్యాసాలతో మా జీవితాలు అంతమైపోతాయి. వాటితోటే మేము సంతృప్తిపడి వూరుకోవాలి కదూ!' హేళన పూర్వకంగా ఒక్క విసరు విసరి, నిట్టూర్పు విడిచింది శాంత. శాంత చాలా రాటుదేలిన మనిషి అని అప్పుడు అర్థమైంది ఆనంద్‌కు.

చంద్రుడు మబ్బుచాటున దాగుడుమూతలాడుతున్నాడు. నక్షత్రాలు తొంగిచూస్తున్నాయి. శాంత ముఖంలో ద్యోతకమయ్యే అసంతృప్తి వ్యథ ఆనంద్ హృదయంలో కలకలాన్ని రేకెత్తిస్తున్నాయి. అర్ధరాత్రి. నిద్రపోవువేళ ఒక స్త్రీ ఒంటరిగానున్న యువకునిదగ్గరకు రావడమే సాహసం. ఆయువకుడు ఆమె వుద్దేశాన్ని, వుద్రేకాన్ని అర్థంచేసికొని, అందుకు అనుగుణంగా ప్రవర్తిస్తే సరే వుంది. తద్విరుద్ధంగా జరిగితే ఆమెకు అవమానమే శరణ్యం. ఆ అవమానంలోనే ఆమె జీవితం తెల్లవారిపోతుంది.

ఆనంద్ సమాజపు నడకను శల్యపరీక్ష చేసినవాడు కాబట్టి శాంతయొక్క రాకలోని అంతరార్థాన్ని శ్రమలేకుండానే అర్థంచేసికోగలిగాడు.

'అలాగే నిల్చుంటావేం శాంతా. ఇలా కూర్చో' అని కాస్త జరిగాడు. ఆమాటకొరకే యెదురుచూస్తోంది శాంత. బెరుకు లేకుండా వెంటనే మంచపుపట్టెపై ఒత్తిగిలబడికూర్చున్నది.

'సరిగా కూర్చో శాంతా.'

ఆమాటల్లోని ఆప్యాయత, ఆదరణ శాంత ముఖవర్చస్సులో ఆనందరేఖలను తాండవింప చేశాయి. సంతోషంతో మనస్సు నాట్యం చేసింది.

'ఎందుకు శాంతా భయపడతావు!' అంటూ నవనీతంలావున్న శాంతబుగ్గపై చిన్న దెబ్బ చరిచాడు ఆనంద్. స్పర్శతో శాంతశరీరంలో విద్యుత్తు ప్రవహించనట్లయింది. స్వాతి వానకు ముత్యపు చిప్పలవలె ఎన్నాళ్ళనుండో ముఖం వాచేట్లుగా మధుర స్వప్నాలను గంటున్న శాంతకు యీ సన్నివేశం నిజంగా స్వప్నంలాగే వుంది. ఒక్కసారిగా 'ఆనంద్' అని అతడి కౌగిటిలో యిమిడిపోయింది. చందమామ మబ్బు చాటున దాక్కున్నది. సంఘానికి విరుద్ధంగా జరిగే చర్యల్ని ప్రకృతి కూడా అసహ్యించుకొంటుంది కాబోలు.

సంఘానికి అన్నీ కండ్లే. ఎంత రహస్యంగా వుండాలనుకొన్నా లోకం వెంటనే దాన్ని బట్టబయలుచేసి పదిమందికీ అందిస్తుంది. సంఘానికి అందరూ యేజంట్లే. కాబట్టే శాంత, ఆనందరావులు తమ రహస్యాన్ని ఎక్కువకాలం దాచిపెట్టలేక పోయ్యారు. తన చిద్విలాసానికి గర్వపడుతూ, తన స్వంతఅక్కయ్య విషాదజీవితాన్ని హేళనచేసే సరోజ యీ రహస్యాన్ని [illegible] కాలంలోనే పట్టగలిగింది. ఆనాటినుండీ శాంతపై సరోజ చిరచిరలు, బురబురలు జాస్తి యిరాయి. ఆరోజునుండి ఆ కొంపలో అక్కచెల్లెండ్రమధ్య నిత్యం సంఘర్షణ ప్రారంభమైంది. పైపెచ్చు సరోజ యెత్తిపొడుపులకు ఆనంద్ భరించలేకపోతున్నాడు. అంతటితో సరోజ కడుపుమంట చల్లారలేదు. మెల్లగా ఈ రహస్యాన్ని అమ్మచెవుల్లో వూదింది. ఎలాగైనా కన్నకడుపు. శాంతవిషయం తల్లి మనస్సుకు యెప్పుడూ కొరవగానే వుంటూంది. గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు పైగా యీ అపనింద శాంతతల్లిని మరీ మతిలేనిదాన్ని చేసివేసింది. ఇంటిగుట్టును రచ్చకెక్కించేందుకు యే తల్లిహృదయం అంగీకరిస్తుంది. మంచిమాటల్తోనే శాంతను అత్తవారింటికి సాగనంపింది. అంతపనీ జరిగేవరకూ సరోజ వుండబట్టలేక పోయింది. యౌవనానికి విలువ తెలియని సమాజం! సమాజానికి తగిన వ్యక్తులు! వ్యక్తులకు తగిన మనస్తత్వాలు! మనస్తత్వాలకు తగిన చేష్టలు! దీనికి యీ యుగంలో విమోచనమంటూ లేదని నిట్టూర్పువిడుస్తూ శాంత తిరిగి భర్తకొలువులో అంతర్లీనమై పోయింది.